# తీయని శాపం

“శారద యింకా రాలేదూ లక్ష్మీ?” ఆఫీసునుంచి వచ్చి ఈజీచైరులో వాలుతూ అడిగాడు శివరావు.

“రాలేదు.” భార్య సమాధానం.

పది నిముషాలాగి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

“లేదండీ. వస్తే అది అలా వీధిలో నుండే వస్తుంది గదా! వీధి వరండామీద కూర్చుని, బయట నుంచి వచ్చే వాళ్ళకోసం నన్నడుగుతా రేమిటీ?”

ఒక చేతితో రెండేళ్ళ బిడ్డ కృష్ణను ఎత్తుకుని ఒక చేతితోనే వంటపని చేసుకుంటూన్న లక్ష్మి సమాధానంలో కొంత విసుగుదల గోచరించింది భర్తకు. ఆఫీసునుంచి అంతకు ముందే ఇల్లు జేరిన అతడూ ఏమంత శాంతంగా లేడు ఆ క్షణంలో.

అందుకే బిగ్గరగా కసురుకున్నాడు భార్య నుద్దేశించి, “ఈడొచ్చినపిల్ల, వేళ కింటికి రాలేదన్న ఆత్రం లేకపోగా ఏమిటా పెంకె సమాధానం? నిన్నా ఆలస్యంగానే వచ్చింది. ఈ మధ్య ఏమైనా - వేషా లెక్కువౌతూన్నట్లున్నాయి, తల్లివి — ఆడపిల్లని ఆ మాత్రం మందలించి అదుపులో పెట్టలేవూ?”

"బాగుంది. మీ కొకటి ఉంది విలువ నా మీద — ఇక పిల్లల కుంటుంది. ఎందుకీ బియ్యేలూ, బి ఎస్సీలూ వద్దంటే వినకుండా దాన్ని చదివిస్తున్నారూ, మీరే చెప్పండి. నా మాట అది వింటుంద గనుకనా ?" లక్ష్మి గొంతు కూడా విరసంగానే పలికింది. "ఉండరా నీ గోలేమిటీ - కాస్త వంట చేసుకొనేప్పుడైనా చెయ్యి దిగవూ" అంటూ కృష్ణను చకాకుగా నేలమీద కుదేసింది. వాడు తారస్థాయిలో ఏడుపు లంకించుకోవడం విన్న శివరావు తన కోపాన్నంతా చేతిలోని న్యూస్ పేపరుమీద చూపిస్తూన్నట్లుగా దాన్ని విసిరేసి టేబుల్ మీదికి, వచ్చి ఏడుస్తూన్న కొడుకు నెత్తుకుని బయటికి తీసుకుపోయాడు.

చల్లగాలిలో త్రిప్పగానే ఏడుస్తూన్న పసివాడు నిదర్పోయాడు. అది గమనించిన లక్ష్మి వచ్చి భర్తనుంచి పిల్లవాడిని తీసుకుని పడుకోబెట్టి వచ్చింది. వంటిల్లు తలుపులేసి వచ్చి తీరికగా తల దువ్వుకోవడం ప్రారంభించింది. అంతలో మళ్ళీ గుర్తుకు వచ్చినట్లుగా జుట్టు అలాగే వేలుముడి వేసేసుకుని, స్నానాల గదిలోకి వెళ్ళింది.

"ఏమిటీ మళ్ళీ ?" వెనుకనే వెళ్ళాడు శివరావు. అప్పటికి ఇద్దరి విసుగుదలలూ కాస్త శమించినట్టుగా ఆ ప్రశాంత ధోరణులే స్పష్టీకరించుతున్నాయి

"ఇవాళ బట్టలు అలాగే పడివున్నాయి. కృష్ణ చెయ్యి దిగక ఉతకడం కుదరలేదు" అన్నది బట్టలబాల్చీ దగ్గఱకు లాక్కుని కూర్చుంటూ.

"నేనోసారి అలా కాలేజీవేపు వెళ్ళొస్తాను."

భర్త మాటలు విని తలెత్తి చూచింది లక్ష్మి. తండ్రిగా అతడి బాధ్యతా, ఆరాటమూ తాండవిస్తూన్న ఆ వదనం చూచి లోలోన బాధపడింది. "వద్దులెండి, ఎందుకూ? ఏ మీటింగులో, ఆటలో ఏవో వుంటాయి. అయ్యాక అదే వస్తుంది. ఆఫీసులో అలసిపోయి రావడమే కాకుండా మళ్ళీ దాని కోసమేం బయుల్దేరుతారు కాళ్ళీడ్చుకుంటూ?". నిజానికి అప్పుడు శివరావుకు వెళ్ళే ఓపికా లేదు. అందుకే అక్కడే పెరట్లో చాపమీద నడుం వాల్చాడు, ఎదురుగా స్నానాల గదిలో బట్టలుతుకుతూన్న భార్యతో ఏవేవో లోకాభిరామాయణం మాట్లాడుతూ.

"అమ్మా, అన్నం పెట్టూ." ఆటల కెళ్ళిన పదేళ్ళ గోపీ, ఆరేళ్ళ పాప బిలాబిలా వచ్చేశారు.

"వస్తున్నా. ముందా కాళ్లూ, చేతులూ కడుక్కోండీ."

"తొందరగా రామ్మా" అంటూనే పాప ముఖమూ చేతులూ పైపైన తొలచుకుని, వంటింట్లో కెళ్ళింది.

గోపీ కొంచం తిక్కరకం, అల్లరిరకం. "ఎందుకూ కడుక్కోవటం మాటిమాటికీ. నువ్వు రా ముందూ, ఆకలంటూంటే ..." బిగ్గఅగా అరుస్తూ కోపంగా కాళ్ళు నేలకేసి బాదుతూ చిందులు త్రొక్కసాగాడు.

"వస్తున్నారా నాయనా." లక్ష్మి చేతిలో పనిని ఆపు జేసి, చేతులు కడుక్కు వచ్చేంతలో గోపీ పాపా కొట్టుకోవటము, పాప వంటింట్లోపడి ఏడుపు ప్రారంభించడం అన్నీ అయిపోయాయి.

"ఛీ. ఛీ. మాయదారి పిల్లలు. ఒక్కళ్ళకీ బుద్ధీ జ్ఞానం లేదు, ఏడిపించేస్తున్నారు." సణుక్కుంటూ వెళ్ళింది లక్ష్మి.

ఇక కలుగజేసుకోకపోతే లాభం లేదనుకున్నాడు శివరావు. "పాపా. ఏడుపు ఆపు!" ఒక్క గర్జన గర్జించాడు. "ఏరా, గోపీ! చెల్లెల్ని కొట్టడానికి సిగ్గు లేదట్రా? మళ్ళీ గాడిదలాగున్నావ్! ఈసారిలా అల్లరి చేశారంటే జాగ్రత్త, కాళ్ళూ చేతులూ విరిచేస్తాను. అమ్మ పనిలో ఉంది — తొందరపెట్టకూడదనే జ్ఞానం లేదట్రా?"

తండ్రి హుంకరింపుతో కుక్కిన పేనుల్లాగైపోయారు పిల్లలు.

"పెట్టాల్సినవి పెట్టేసిరా లక్ష్మీ. ఎందుకూ దగ్గఱ కూర్చోవడం?" అన్నాడు భార్య నుద్దేశించి.

"అయ్యో, అంతమాత్రం సఖ్యత కూడానా ఈ మొఖాలకి? ఎదుట లేకపోతే ఇవన్నీ జిమ్మేసి, కొట్టుకుని, మళ్ళీ నాకు లేనిపోని చాకిరీ కల్పించరూ!"

"ఏడిశారు. నే నిక్కడ లేనూ? వచ్చెయ్. నోరెత్త మను, చూస్తాను."

లక్ష్మి తిరిగి స్నానాల గదిలోకి వెళ్ళిపోయింది, వదిలేసిన పనిని ముగించుకోవటానికి.

తండ్రి కోపంగా ఉండడం గమనించిన పిల్లలు కిక్కురుమనకుండా భోజనం ముగించి, పుస్తకాలు తీసుకుని వీధి గదిలో కూర్చున్నారు.

మోచేతిపై ఆనుకని పడుకొన్న శివరావుకు బట్ట

ఉతుకుతూన్న లక్ష్మి స్పష్టంగా కన్పిస్తోంది. అంతవఱకూ తల దువ్వుకోవటానికే తీరికలేక చెదరి రేగిపోయివున్న జుట్టు, ఒకటి తర్వాత ఒకటిగా ఎదురు చూస్తూన్న పనులలోపడి నీరసం ఆవరించిన ముఖం, ఆమె మనస్సులోని విసుగుదలను స్పష్టీకరించుతూ ముడివడివున్న భృకుటి - అపరిమితమైన జాలి కలిగింది శివరావుకు, భార్యపై. సరిగా అదే క్షణంలో కుమార్తెపై ఎక్కడలేని చీకాకూ, కోపం కూడా ఉద్భవించాయి. 'ఎదిగిన పిల్ల టైముకు ఇల్లుజేరి తల్లికి కాస్త సాయం చేయకూడదూ ?'

తలెత్తి చూచాడు ఆకసం దెస. సంధ్య చీకట్లు అల ముకోనున్నాయి.

"ఇంకా రాలేదే శారదా !" స్వగతాన్ని పైకే అనేశాడు. "ఏమీ వెకిలి వేషాలు కానీ అలవాటు కావడంలేదు గద ! ఏమో, ఈకాలం పిల్లలు !" అన్నాడు తిరిగి భార్యనుద్దేశించి.

"ఛ." తేలికగా తీసి పారేసింది అతడి మాటలను లక్ష్మి. "అది మన బిడ్డ !" అన్నది గర్వంగా.

శివరావు మౌనం వహించాడు.

లక్ష్మి బట్ట లుతకడం పూర్తిచేసి, ఆరవేస్తోండగానే, ఏమొచ్చిందో ... నిద్రపోయిన కృష్ణ లేచి ఏడుపు ప్రారంభించాడు. పైకి ఏమీ తేలి మాట్లాడకపోయినా, లక్ష్మి మనసులోని నిస్సహాయక్రోధం, విసుగుదలా ఆమె ముఖంలో స్పష్టంగా ప్రతిబింబించి నట్లనిపించింది, ఆమెనే పరీక్షగా చూస్తూన్న శివరావుకు; లోలోపల భార్యపై ఎనలేని జాలీ,

సానుభూతీ కూడా కలిగాయి. పాపం – లేచిన దగ్గర్నుంచీ అడుగడుగునా ఉరుకులూ, పరుగులూ బ్రతుకే కదా ఆవిడది! ఏమి సుఖపడుతోంది!

అంతలో శారద రానే వచ్చింది "అమ్మా, అమ్మా!" అని వీధిలోంచే ఉత్సాహంగా కేకలు వేసుకుంటూ.

విసుగ్గావున్న లక్ష్మి ఆ ఉత్సాహాన్ని గమనించి, స్వీకరించే స్థితిలో లేదు. "ఏం, అమ్మాయిగారూ పెత్తనాలు, ఇల్లు జ్ఞాపకమొచ్చింది? పిల్లాడేడుస్తున్నాడు, నే చూస్తాగానీ ఈ బట్టలు డాబామీద ఆరవేసిరా." భుజాన వున్న తడిబట్టల మోపంతా కూతురి భుజానికి బదిలీచేసి వెళ్ళిపోయింది లక్ష్మి.

ఎక్కడలేని చీకాకూ, కోపం కలిగాయి శారదకు. "ఛీ, ఈ తడి గుడ్డలన్నీ నా భుజాన్నేస్తావ్ చక్కటి చీరా, జాకెట్టూ నాశనం. ఇలా వచ్చానో లేదో - అలా ఏదో ఓ పని అంటగడతావ్" కోపంగా చేతిలో పుస్తకాలు కిటికీలో పారవేసి, భుజంమీది తడి గుడ్డలు చేతిలోనికి తీసుకొని, బట్టలెక్కడ పాడయ్యాయో అని చూసుకుంటూన్న కూతురి ధోరణికి కోపం వచ్చింది శివరావుకు.

"ఏమిటా ఛీదరింపులూ నువ్వూ? ఆడదానివి కాదూ, పని పాటలు చేసుకోకపోతే ఎలాగ? నిక్కి నీలిగి ఇప్పుడింటికి జేరావ్. కాలేజీ వదలి ఎంత సేపైంది? ఏం, టైముకు ఇల్లు జేరాలనే జ్ఞానం లేదూ?"

"మరే ... కాలేజీ ఫంక్షన్‌కి పాటలు రిహార్సల్ ..." మాటలు పూరించలేకపోయింది శారద, తండ్రి ఉగ్రరూపం చూస్తూ.

"చాల్లే. పాటలూ, డ్యాన్సులూ మనలాంటివాళ్ళ కొక్కడుగానీ, బుద్ధిగా చదువుకుని, టైముకు ఇంటికి తగలడు. వచ్చి కాస్త అమ్మకు పనులలో సాయంచేస్తే ఏమీ పాపం గానీ చుట్టుకోదు. మళ్ళీ ఆలస్యంగా ఎప్పుడూ రావటానికి వీల్లేదు తెలిసిందా ?" హుంకరించి, పై తువ్వాలు దులుపు కుంటూ లేచి వెళ్ళిపోయాడు శివరావు ముందుగదిలోకి.

పిల్లవాడిని జోకొట్టి, తిరిగి నిద్ర పుచ్చి లక్ష్మి వచ్చే సరికి శారద బట్టలారవేయడం పూర్తిచేసి, వంటింట్లో తల్లి చేయగా మిగిలిపోయిన పనిని పూర్తిచేయసాగింది.

'ప్రొద్దునగా తినిపోతుంది, హడావుడిగా. సరిగా తిననే తినదు. అదీ వంట పూర్తైననాడు మాత్రమే. మధ్యాహ్నం అక్కడ టిఫిన్ కానీ, కాఫీగానీ తీసుకోమని డబ్బులిచ్చి పంపేంత ఆర్థిక స్తోమతు తమకు లేదు. కాలేజీ ఇంటికి రెండు మైళ్ళు దూరం. తిరిగి ఇంటికి రావటానికి రిక్షా డబ్బులు కూడా ఓనాడుంటే ఓనాడుండవు. కాళ్ళీడ్చుకుంటూ వస్తుంది పాపం రెండు మైళ్ళూ! రాగానే కాస్త సేద తీర్చుకోకుండా పని చెప్పాను ఇద్దరం తిట్టాం !' అనుకున్న లక్ష్మి మనస్సు బాధపడింది.

"అలా కూర్చో. కాస్త కాఫీ త్రాగావా ?" అన్నది కూతురు చేతిలో పని అందుకుంటూ.

"లేదు." ఇంకా ముఖం ముడుచుకునే వున్నది శారద.

"అదిగో. ఆ గ్లాసులో వుంది. వెచ్చబెట్టుకు త్రాగు."

శారద మాట్లాడలేదు; కాఫీ తీసుకోలేదు. వెళ్ళిపోయి కాలేజీ దుస్తులు మార్చుకోసాగింది.

వెళ్తూన్న కూతురి దెసీ చూచి ఒక్క నిట్టూర్పు వదిలింది లక్ష్మి.

తానే గ్లాసులో పోసి కాఫీ తీసుకెళ్ళేసరికి శారద నిన్నటి బట్టలను ఇస్త్రీ చేస్తోంది.

మాట్లాడకుండా త్రాగేసి గ్లాసు యిచ్చేసి మళ్ళీ తన పని చేసుకోసాగింది శారద.

తల్లికి బాధ అన్పించింది. శారదను కాస్త కోపం తగ్గించి ప్రసన్నురాలిని చేసే ఉద్దేశ్యంతో, "ఏమిటి ఇందాక చెప్పవచ్చావ్ ?" అనడిగింది మృదువుగా.

శారద తలెత్తకుండా పని చేసుకుంటూనే అన్నది ముక్తసరిగా, "ఏమీ లేదు."

"బాగుంది తల్లీ నీ కోపం నువ్వూను. తల్లి విసుగ్గా వుండి ఓమాటే అనకూడదా బిడ్డల్ని ? ఇదేనా మీ కాలేజీల్లో చెప్పే చదువు ? తల్లినీ తండ్రినీ ఇలా సాధించమనా?"

అప్పటి కింకేం మాటలు జరగలేదు.

శారద చిన్న చిన్న పనులన్నీ ముగించుకుని, పుస్తకాలు తెరిచి చదువుకునేందుకు కూర్చున్నదల్లా, మళ్ళీ ఏదో గుర్తుకువచ్చినట్లుగా గబగబా పుస్తకం మూసేసి వెళ్ళి భోజనాలు వడ్డిస్తూన్న తల్లికి సాయం చేయడాని కుపక్రమించింది. అంతా గమనిస్తూనే వున్నది లక్ష్మి.

"నే వడ్డిస్తానులే. నువ్వూ కూర్చో శారదా." అన్నది.

""వద్దులేమ్మా, మనిద్దరం తర్వాత తిందాం- ఇదుగో ఈ గోపీ, పాపా వున్నారుగా వంటిల్లు వంటిల్లులా ఉంటుందా ఇక వీళ్ళిద్దరూ భోజనానికి వస్తే?"

"వాళ్ళిద్దరూ ఇందాకనే తిన్నట్లున్నారు, మళ్ళీ ఏమిటీ?" పీటమీద కూర్చుంటూ అడిగాడు శివరావు.

కోపంగా చూస్తూన్న భర్తనూ, బిక్కముఖాలతో చూచే పిల్లలనూ మార్చి మార్చి చూచి ఎటూ మాట్లాడ లేక వూరుకొంది లక్ష్మి.

"చిన్నపిల్లలుకదా నాన్నా. వాళ్ళ ఆకలి వాళ్ళకే తెలియదు. ఇందాక సరిగా తిని వుండరు" అంటూ సర్దేసింది శారద.

"వాళ్ళ మొహం. ఇన్నిసార్లు తినడం మంచిది కాదు. జీర్ణశక్తి పాడైపోతుంది. పాలు ఇస్తూండు రాత్రిళ్ళు ఒకో గ్లాసుడు."

"అలాగేలెండి" అన్నది లక్ష్మి.

వాళ్ళ భోజనాలై లేవగానే, అక్కడ శుభ్రపరచి, ఒక్కటే పీట వేసి కంచం పెడ్తూన్న శారదను విసుగ్గా చూచింది లక్ష్మి. "అదేం, ఒక్కళ్ళకే పెడ్తున్నావ్. ఇద్దరం తినేద్దాం. రెండు పీటలూ వేసిపెట్టు."

ఇబ్బందిగా పెట్టింది శారద ముఖం, "నువ్వు తినే యమ్మా, నేను పడుకోనేముందు తింటాను. ఇప్పుడే తింటే

తొందరగా నిద వచ్చేస్తుంది. చదవాల్సింది చాలా ఉంది. పరీక్షలు దగ్గఱ పడ్తున్నాయి."

"ఏం చదువులో ఏం లోకమో!" మూలిగింది లక్ష్మి. "ఎప్పుడో ప్రొద్దున్ననగా తిన్న మెతుకులు. నీరసం వస్తుంది. పోనీ కొంచం టీ త్రాగుదువుగానిలే తర్వాత."

"లేదులేమ్మా" నువ్వు తినేసేయి. టీ త్రాగినా సరే-అన్నం తింటే మాత్రం నిద్ర వచ్చేస్తోంది."

ఇక వాదించలేక మౌనంగా తాను తింటానికి కూర్చుంది లక్ష్మి.

దొడ్లో పంపు దగ్గఱ పడవేసిన పళ్ళాలూ, కొన్ని ఖాళీ అయిన గిన్నెలూ తోమటానికి కూర్చుంది శారద.

ఆ శబ్దం వినవచ్చి ఎంగిలిచేత్తోనే లేచివెళ్ళింది లక్ష్మి "లే శారదా. అవన్నీ నేను చూచుకుంటాలే. పోయి చదువుకో నువ్వు" అన్నది.

"కొంచమేగా? కొన్ని నేను కానిస్తే మిగిలినవి నువ్వు చూచుకుందువుగాని. నీకూ కొంచం పని తేలికౌతుంది."

"వద్దు - లేవ'మంటే వినవేమిటే? ఈ పనంతా చేసినా నిద్రే వస్తుంది చదువుకో." ఆజ్ఞాపించినట్లుగా అన్నది.

శారద కదలలేదు. "అయిపోయాయి లేమ్మా. ఎందుకూ భోజనం మధ్యలో లేచివచ్చావ్ ?"

సమీపంలో'నే చల్లగాలికోసం దొడ్లో మంచం వేసుకు పవ్వళించిన ప్రక్క వాటా ముసలమ్మ అందుకుంది ఆ సంభాషణ మధ్యలో— "ఏమే అమ్మాయి నాకు తెలీకడుగుతాను, చేతికందివచ్చిన పిల్ల కాస్త పని పాటలు అందు

కొని, నేర్చుకోకపోతే ఎలాగ ? అరిగిపోతుందా ఏమిటే? అసలే మైనా ఉద్యోగాలు చేయాలా, ఊళ్ళేలాలా ?"

"ఏమో, ఆ మాట ఆ తండ్రీకూతుళ్ళకే తెలియాలి." లక్ష్మి తిరిగి లోనికి వెళ్ళిపోతూ అన్నది.

తోమిన సామగ్రిని తొలచి శుభ్రం చేసుకొని వెళ్ళిపోతూ నెమ్మదిగా అన్నది శారద. "మీరన్నది నిజమే బామ్మగారూ. అందివచ్చిన పిల్లలు కాస్త పెద్దవాళ్ళ చేతుల్లో పని అందిపుచ్చుకుంటే అరిగిపోరు. అందుకే నేనూ నాన్న భారం కాస్త అందిపుచ్చుకుని మోయాలనుకుంటున్నాను, ఈ చదువు త్వరగా -శ్రద్ధగా పూర్తిచేసి!" శ్రద్ధగా అన్న మాటను ఒత్తి పలికింది. "ఈ కాలంలో ఆడవాళ్లు ఊళ్ళేలుతున్నారుగా ? ఉద్యోగాలు మామూలే ఇక !"

"కలికాలం పిల్లలు ! మాట్లాడగలమా ?" ముసలమ్మ గొణుక్కుంది.

అన్నీ ఆద్యంతం లక్ష్మికి వినిపించాయి. కూతురి మాటలు సబబే అయినా, మాటలు పలికే తీరులో వినమ్రత ఉన్నప్పటికీ, వయస్సులో చాలా పెద్ద అయిన ముసలమ్మతో నిన్న మొన్న కళ్లు తెరిచిన తన శారద అలా మాట్లాడడం అవిధేయతగా అనిపించిందామెకు.

"ఎందుకూ ముసలమ్మతో అలా పెడసరంగా మాట్లాడడం ? మీ చదువుల్లో ఇలాగే చెప్తున్నారేమిటి పెద్దవాళ్లనెదిరించమని? బుద్ధి లేకపోతే సరి!" మందలింపుగా అన్నది. శారదదికూడా అంతగా ఊరుకుండే స్వభావం కాదు. "అం మరే! లేకపోతే ఆ అన్నీ తీరిన ముసల్దానికెందుకూ చిన్నాళ్లే

విషయాలు ? తన కాలంలో లాగా ఈ కాలంలో వాళ్ళు పిడకలు చేసుకుంటూ. గిన్నెలు తోముకుంటూ కూర్చోరు... ఇంట్లో కోడళ్ళని సాధించి సాధించి తీరిగ్గా పడుకున్నట్టుంది మహాతల్లి, మళ్ళీ నేను దొరికాను!" అంటూనే విసవిసా వెళ్ళిపోయింది.

"అప్రతిష్ఠకూడానూ, ఇలాంటిదాన్ని ఎక్కువగా మాట్లాడిస్తే బొత్తిగా పెంకెతనం !" గొణుక్కుంది లక్ష్మి.

ఆమె భోజనం ముగించి లేచేసరికి చప్పుడుకాకుండా పిల్లిలా వచ్చి నుంచున్నాడు మోహన్ ఎదురుగా. ఎంతైనా కోపం కలిగింది లక్ష్మికి. "ఏరా, గాడిదా! తిరగడం అయ్యిందా ఇల్లు జ్ఞాపకం వచ్చిందీ ? సిగ్గు లేదట్రా, పరీక్షలు పట్టుమని పది రోజులుకూడా లేవూ"

"అబ్బ. మెల్లగా మాట్లాడమ్మా, నాన్న వింటారూ." భయం భయంగా అటు యిటు చూస్తూ అన్నాడు మోహన్. "పరీక్షలు దగ్గరకొచ్చాయనే ప్రైవేటు క్లాసు పెట్టారూ !"

"అలాగట్రా, నాకు తెలియనే తెలియదూ. రాత్రింబగళ్ళూ చదివితే కానీ ఆ మాయదారి పరీక్షలు గట్టెక్కవామే ! దా నాయనా, అన్నం తిందువుగాని !"

"ఏమీకాదు ఎవడటా వీడికిప్పుడు ప్రైవేటు క్లాసు పెట్టినదీ ? మహా వగలుబోతున్నారు తల్లీ కొడుకూనూ ?" పడగ్గదిలోంచి దూకుడుగా వచ్చాడు శివరావు. మోహన్ బెదరిపోయి లేడిపిల్లలా నుంచున్నాడు.

"ఏరా, నువ్వు ఇవ్వాళ మినర్వా సినిమాలో ఆట చూడ్డానికెళ్ళ లేదూ ?" చెవ్వి పట్టుకుంటూ అడిగాడు నిగ్గదీసి.

మోహన్ కళ్ళు అప్పటికే కాల్వలు కడుతున్నాయి.

"ఏరా మాటరాదే నోటినుంచి ? ఛండాలుడా !" పట్టరాని ఆగ్రహంతో లెంపలు వాయించేశాడు శివరావు కొడుకుని. అటునుంచి భార్యా, ఇటునుండి కూతురు వచ్చి అడ్డుకున్నా ఆపలేకపోయారతడిని.

"ఎలాగో చచ్చీ చెడీ, తినో-తినకో చదివిస్తున్నానురా మిమ్మల్ని!" కోపంతో ఆయాసంతో రొప్పుతున్నాడు శివరావు. "ఆఫీసులో ని కాక, మరో షాపులో రెండు గంటలు పార్ట్‌టైము జాబ్ చేసి తెస్తున్నానురా మీక్కావలసిన డబ్బూ! చెమటోడ్చి నేను సంపాదిస్తూన్నది మిమ్మల్నైనా కాస్త బాగా బ్రతికేట్టు చేద్దామనిరా. ఇవి చదువుకొనే రోజులు. ఇప్పుడు చదువుకోకపోతే ఆనక గుమాస్తా పనికి కూడా పనికిరాకుండాపోయి, పెళ్లాం బిడ్డల్ని పోషించుకోలేక ఏడుస్తారు. రోజూ సినిమాలూ, షికార్లూ ! చగు వెవడు చదువుతాడురా ?"

"చదువుతున్నాను నాన్నా !" చెంపలు సవరించుకుంటూ వెక్కుతూ అన్నాడు మోహన్.

"ఛీ నోరుమ్మయ్ ! సిగ్గు లేదట్రా, నీకంటె చిన్నది శారద - నీకంటె ఎక్కువ చదువుతోంది. ఓ ఏడు ఫేలయ్యాను -- ఈసారైనా గట్టెక్కుదామన్న పట్టుదల లేదు. ఎందుకొచ్చిన బ్రతుకూ, సిగ్గూశరం లేకపోయాక ? నేను రిటైరయ్యేనాటికైనా నువ్వు అందుకొంటావేమోననుకుంటే-

నీ కెక్కడా బాధ్యత తెలిసి చావడంలేదు. నేనేం చేయను ? రెక్కాడితేనే డొక్కాడే బ్రతుకులు మనవి. తాతలు సంపాదించి పెట్టిన తరగని ఆస్తిపాస్తులుగానీ లేవు మనకు. ఖర్మం చాలక నేను గానీ 'హరీ' మంటే మీపాట్లు కుక్కలుకూడా పడవ్."

"చాల్లెండీ మరీ నోటికి హద్దులేదు. చల్లని వేళ ఎందుకా అశుభపు మాటలు ?" కళ్ళొత్తుకుంది లక్ష్మి.

"నువ్వూరుకో లక్ష్మీ!" శివరావు కోపం భార్యమీదికి మళ్ళింది. "అసలు నువ్విలా అడ్డుకోబట్టే వాడికింత అలుసుగా ఆటగా తయారైంది భయభక్తులులేక. నేను భయం చెప్పేప్పుడు అడ్డురాకు. అమ్మవచ్చి ఆదుకుంటుంది కదా అనే ధైర్యం పట్టి వాడింకా వాజమ్మలాగా తయారౌతాడు. ఈ రోజునుంచి వాడు ఆలస్యంగావస్తే అన్నం పెట్టకు జాగ్రత్త!" హుంకరిస్తూ వెళ్ళిపోయాడు.

"మీ నాన్న చెప్పేదైనా మీ బాగుకే కదట్రా నాయనా. బొత్తిగా ఇంత బాధ్యతలేకుండా ఎలా చెప్పూ ? ... ..." మెత్తమెత్తగా కొడుకుని మందలిస్తూ, బుజ్జగిస్తూ భోజనం పెట్టి, "ఇక ఇవాళ్టికేం చదువుతావులే పడుకో" అని వాడికి పక్కవేసి వచ్చి మళ్ళీ కూతుర్ని తొంగిచూచింది.

చదువులో దీర్ఘంగా మునిగివుంది శారద.

"పదకొండైంది శారదా, ఇంకా అన్నం తినవూ ?" అన్నది.

"అయిపోయింది. ఇంకొక్క గంట." పుస్తకంలోంచి దృష్టి త్రిప్పకుండానే జవాబిచ్చింది శారద.

"హుఁ." తలపంకించి స్వగతం పైకే విన్పిస్తూ నిట్టూర్చబోయింది లక్ష్మి! "ఏమిటో చదివి ఉద్యోగాలు చేయాల్సిన మగాడు అలాగ! బతిమాలినా చదవడు. ఈ పాటికి పెళ్లై ఇద్దరు బిడ్డల నెత్తుకోవలసిన దానికి ఇంత చదువు యావ!"

పుస్తకం మూసేసి మరో పుస్తకం చేతికి తీసుకుంటూ చివాలున తలెత్తింది శారద. "ఏం ఆశీర్వదించక్కర్లేదులే నువ్వు. పిల్లల్నెత్తుకోవాలట, పిల్లల్ని! ఇంతకంటె ఇంకో పనేం లేనట్లు! నేనసలు పెళ్ళే చేసుకోను!" విసురుగా అన్నది. "పెళ్ళీ పిల్లలూ ... యాతనలూ ...మీరు పడుతున్న అగచాట్లు చాలవూ? మాకూ కూడా ఎందుకూ ఈ గోలలన్నీ?"

నవ్వుకుంది లక్ష్మి. "ఇప్పుడేలే ఈ పెద్ద కబుర్లన్నీ, ఆనక చూడనా ఏం చేస్తావో! పెళ్ళనగానే ఎగిరి గంతేస్తారిలాటివాళ్ళే!"

ముఖం కందగడ్డలా చేసుకున్న శారద ఏమీ మాట్లాడలేదు.

పడుకోబోతూ భర్తవేపు చూచింది లక్ష్మి. కళ్ళు తెఱచి ఇంటి కప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచనలో మునిగి వున్నాడు శివరావు.

తదేకంగా కొలది క్షణాలు అతడివేపు చూచిన లక్ష్మి మృదువుగా అన్నది: "నిద్రపొండి, ఎందుకలా బాధపడటం? పిల్లలు మాట వినకపోతే మందలించక తప్పదు మరి! బాధగానే వుంటుంది, వాళ్ళకీ మనకీ కూడా. ఏం చేస్తాం?"

"ప్చ్." అటునుంచి ఇటు ఒత్తిగిలి అన్నాడు శివ రావు. అతడి ఎదలో అనేక భావాలు పరుగులిడుతూన్నట్లు ఆ ముఖకవళికలే చెప్పక చెబుతున్నాయి. "ఏమిటో లక్ష్మీ, మన చీకాకుల్లో మనం ఉండి పిల్లల్ని తిట్టేస్తాం కానీ ... నిజానికి వాళ్ళ వయస్సు లేమాత్రం చెప్పూ? మోహన్‌కి పదిహేడూ, శారదకి పదిహేనూ ! అంతేగా ?"

"అయితే ? బాగుంది, ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు వాళ్ళు బుద్ధులు నేర్చుకోనేదీ ? పదిహేనేళ్ళు తక్కువా ? నేను పదకొండేళ్ళకే పెళ్ళై, పదమూడో ఏట మీ యింటి కొచ్చేశాను కాపురానికి ఏడాదికే మోహన్ ... ..." సిగ్గు పడ్తూ అసంపూర్తిగా వదిలేసింది మాటల్ని.

"నిజమేలే !" శివరావు కంఠం మెత్తగా పలికింది. "అవి ఆ రోజులు! అయినా పైపైకి అలా పెద్దల మాటకూ, సంఘధర్మానికీ కట్టుబడి సరిపెట్టుకొని బ్రతికేవాళ్ళమే కానీ, లోలోన మనకు మాత్రం అసంతృప్తి ఉండేది కాదంటావా? నిజం చెప్పు !"

భర్త సూటిగా తన కళ్లలోకి చూస్తూ, తన అంతరాలను చదివేసినట్లుగానే అడుగుతూంటే కాదని బుకాయించ లేకపోయింది లక్ష్మి.

"నీకు పదమూడైతే నాకు పదిహేడూ అప్పుడు ఔనా ?" తిరిగి ప్రశ్నించాడు శివరావు.

ఔనన్నట్లుగా తల ఊపింది.

"ఇంకా పసితనం వీడని వయసే నీది అప్పుడు మరి ! ఆటపాటలూ, స్నేహితులూ — అన్నీ వీడలేక, ఎరుగని

క్రొత్తింట్లో భయం భయంగా అడుగిడి బ్రతుకుతూ, అప్పుడే బాల్యం అయిపోయిందే అని బాధపడ్తూ, అప్పటి సంఘ నియమాలకూ, కుటుంబాచారాలకూ మాత్రం అయిష్ట మైనాసరే, తప్పనిసరిగా తల ఒగ్గి బ్రతికేదానవు. నేనూ అంతే. ఇరవయ్యేళ్ళకే - 'ఈ చదువు చాలూ' అని నాన్నగారు మాన్పించేసి ఉద్యోగంలో ప్రవేశపెడితే పెద్ద పెద్ద డిగ్రీలు లేవనే అసంతృప్తితో, ఇంకా చదువును కొనసాగించాలనే ఉబలాటాన్ని తప్పని సరిగా చంపుకుంటూ బ్రతికాను ... ... పధ్నాలుగేళ్ళకే నీ ఒడిలో పసివాడు! పసితనం వీడని నువ్వు పసిబిడ్డ తల్లివి !"

లక్ష్మి ముఖం వివాహపు తొలి రోజులనూ, మలి ఘట్టాలనూ తలచుకొంటూ పరధ్యాన్నంలో పడింది. ఏమేమి ఆలోచనలు ఆ మనస్సున నిలిచాయోగాని — కనుకొలకులలో నీటిబిందువులు నిలిచాయి, ఆ లైటు వెలుగులో మిల మిల మెరుస్తూ.

సానుభూతి తొణికిసలాడింది శివరావు నేత్రాలలో. "ఆ చిన్నతనంలోనే అత్తమామల అధికారాలూ, ఆడబిడ్డల ఆరళ్ళూ, పసిబిడ్డలతో కష్టసుఖాలూ అన్నీ అనుభవించేశావ్. మధ్య మధ్యన నా చికాకులూ, అధికారాలూ కూడా సహించావ్. పాతికేళ్ళదానివే యాభయ్యేళ్ళ అనుభవమూ, వార్ధక్యమూ ఆవరించేశాయి. ఔనా ?"

తల పంకించింది లక్ష్మి. కళ్ళొత్తుకుంటూ.

"నేనూ మఱిమనిషిలాగా తయారైపోయాను. పెద్ద

చదువులు చదవలేదన్న అసంతృప్తి ఇప్పటికీ అప్పుడప్పుడు
తలెత్తుతూనే వుంటుంది. ఏం చేస్తాం? సరదాలన్నీ చచ్చి
పోయాయి. ఎంతసేపూ ఈ పిల్లల్ని పెంచి పెద్దచేయాలి —
వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేట్టు చేయాలి అనే తాపత్ర
యమే ఈనాడు మనిద్దరికీ కూడా !"

కొంతసేపు ఆగి తిరిగి తానే అన్నాడు : "ఇంత హైరాన
పడిబ్రతుకుతూ,ఇంతటిఅసంతృప్తిని అంతరాంతరాలలో దాచు
కొని బలవంతంగా జీవితాన్ని వెళ్ళదీస్తూ బ్రతుకుతున్నాం.
మనమే కాదు. ప్రపంచంలో మూడొంతులు ఇంతే. అయినా,
అన్నీ తెలిసీ తిరిగే మన పిల్లల్ని కూడా ఆ కూపంలోనే
త్రోస్తాం. ఆ పరిధిలోనే పయనింపజేస్తాం."

"వేరే దారేముంది గనుక? నలుగురితో బాటూ
ప్రపంచపు పోకడలో పోవద్దా?"

"పోవాలి దారిలేదు. కానీ ... కానీ ... ఏమిటో
నాకే తెలియని బాధ ఆవరిస్తుంది ఒక్కోసారి పిల్లల్ని దండిం
చాక ... ... .. చూడూ, మన ఎదురింటి వాళ్ళ పిల్ల
పద్దెనిమిదేళ్ళది. మన శారద కంటె పెద్దది. ఇంకా ఇంగ్లీషు
వాళ్ళలాగా గౌన్లు వేసుకుని, పసిదానిలాగా ముద్దు ముద్దుగా
మాట్లాడుతూ కుక్కపిల్లని వేసుకొని షికార్లు చేస్తూవుంటుంది.
మనం మన పద్ధతిలో పెంచుతున్నా శారదని చీర ధరించి నీ
అంతా ఉంటుంద శారద నీ ప్రక్కన."

"బాగుంది. ఆడపిల్లల్ని అలా తిప్పడం మంచిదా?
మన పద్ధతే మంచిది."

"నిజమేననుకో. కాని శారద యింకా లోకం తెలియని పసిది. మన యింట్లో చాలీ చాలని జీవితం చికాకులూ దానికి బాగుండవ్. ఆ రంగు రంగుల జీవితం తనకు లేదని లోలోపల అసంతృప్తిపడ్తోంది. అందుకే అది మననీ, మన జీవితాన్ని ఛీదరించుకొంటుంం దన్పిస్తుంది."

"అబ్బే అటువంటిదేం లేదే !"

"కాక, మరేమిటి ? ఇంతకుముందు ఏ మంటోంది నీ మాటకి ?"

లక్ష్మి మాట్లాడలేదు.

"పెళ్ళి పిల్లలూతో మీగుపడే అగచాట్లు మాకక్కూడా ఎందుకు లెమ్మని కదా అంటోంది !"

"దాని మొహం." తేలికగా తీసేస్తూ నవ్వేసింది లక్ష్మి. "దాని మాటల కేమిటి ? చిన్నప్పుడు అందరు ఆడపిల్లలూ అలాగే ఉంటారు. నా మటుకు నేనూ అంతే."

నవ్వేశాడు శివరావు. "చూశావా మరి ? అయినా మళ్ళీ నీ కూతుర్ని నువ్వలాగే ఆశీర్వదిస్తున్నావ్ ! నా మటుకు నేను ... ... ఇరవై ఏళ్ళకే ఏమిటి నాకీ బాధ్యతలన్నీ అని చికాకు పడే వాడిని-మోహన్ నా బరువు అందుకుని నన్ను తేలిక పఱచాలనీ ఆశిస్తున్నాను !"

"సరే. పడుకోండి." ఆవులిస్తూ ఒత్తిగిల్లింది లక్ష్మి. "ఈ గొడవలూ సమస్యలూ తెగేవీ— సమాధానాలు దొరికేవీ గనుకనా ?"

నవ్వుకున్నాడు శివరావు. ఆమె పరిజ్ఞానం అంతే.

ఇవన్నీ అర్థం చేసుకోగలంత స్థాయికి ఎదగలేదు, నాలుగు గోడల మధ్య ఆమె మనస్సు!

తెల్లవారి తిరిగి మామూలు సంసార యజ్ఞం ప్రారంభమైంది. తల మునిగే పనులలో లక్ష్మి పిల్లలందర్నీ విసుక్కోవడం ప్రారంభించింది.

"ఏమే పాపా, ఎక్కడేడుస్తున్నావే! ఈ పసి వెధవని కాస్త ఆడించకపోతే నేను పన్లెలా చేసుకోనూ? కాళ్లా వేళ్లా అడ్డబడ్తున్నాడు."

పాప వచ్చి ముఖం విసుగ్గా పెట్టింది. "నేను లెఖ్ఖలు బోల్డు చేసుకోవాలమ్మా. లేకపోతే మాష్టారు కొడ్తారు స్కూల్లో!"

"మీ చదువులు బంగారం గానూ! పెద్దది కాస్త పని అంది పుచ్చుకోదు. దానిమట్టుకు దానికీ చదువే. నీ మట్టుకు నీకూ చదువే. ఎలా చచ్చేదీ నేనూ?" మనసులోని విసుగంతా చేతిలోని గిన్నెలమీదా, గరిటలమీదా చూపసాగింది లక్ష్మి.

పాప చేసేదేంలేక చంటితమ్ముణ్ణి తీసుకపోయి తన దగ్గఱే కూర్చోబెట్టుకొని చదువుకోసాగింది. కాని పది నిముషాలు కూడా సాగలేదా చదువు. రెండేళ్ళ క్రిష్ణ పాప పుస్తకాలన్నీ సవరించి తీరికగా చింపి పోగుపెట్టడం ప్రారంభించాడు. పాపను నిస్సహాయక్రోధం ఆవరించింది.

"చూడమ్మా" అంటూ ఆరునొక్క రాగం మొదలెట్టి, ఇంకా క్రోధం పట్టలేక చేతిలో పుస్తకంతోటే కృష్ణ తలపై

రెండు బాదింది. వాడూ ఆకాశానికో పెదవీ, భూదేవికో పెదవీ అన్నట్లుగా నోరు తెఱచి ఏడుపు ప్రారంభించాడు. ఈ కోలాహలం విన్న లక్ష్మి వంటింట్లోంచి పరుగెత్తుకొచ్చింది. స్నానం చేస్తూన్న శివరావు స్నానం పూర్తికాకుండానే తువ్వాలు చుట్టబెట్టుకొచ్చాడు నీళ్ళోడుకుంటూ, "ఏమిటా గాలి వానా ?" అంటూ.

"గాలివానా, పాడా ?" లక్ష్మి అసహనంగా పాపను రెండు అంటించింది. "పిల్లాడిని ఆడించమంటే తీసుకొచ్చి కొత్తావటే భడవ ఽనా ! పుస్తకాలో, చింపిరి కాగితాలో ఆ పసివాడికేం తెల్సు గనుకా ?"

పాప వెక్కి వెక్కి ఏడవటమే కానీ, మాట్లాడలేదు.

శివరావు పాపను చూచి జాలిపడ్డాడు. "కాగితాలు మళ్ళీ నేను కుట్టిపెడతాలేమ్మా. ఏడవకు." అంటూ కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

లక్ష్మి కోపం శారదవైపు ప్రసరించింది. గాలివాన లాగా వెళ్ళింది శారద చదువుకుంటూన్న గదిలోనికి. ఆల్జీబ్రా ఈక్వేషన్ సాల్వ్ కాక తికమకపడ్తూన్న శారద అసహనంగా చూచింది తల్లి వెస.

అదేమీ గమనించగలస్థితిలో లేదు లక్ష్మి. నీ చదువులతో మమ్మల్ని ఉద్ధరించేదేం లేదుగానీ — కాస్త నాకు సాయం చేస్తే అదే పదివేలు." అంటూ కూతురి ముందున్న పుస్తకాలు తీసేసి బల్లమీదికి విసురుగా గిరవాటు పెట్టింది.

ఉక్రోషం ముంచుకొచ్చింది శారదకు. "ఏమిటమ్మా నీ గొడవ ! ఇవాళ నేనేం చేయలేను. అర్ధరాత్రివఱకూ

చదువుకున్నాను. మళ్ళీ తెల్లారుఝామున లేచి కూర్చున్నా ఇవి తరగటంలేదు. చదువుకొనేవాళ్ళు చాకిరీ చేయలేరు."

"నేనూ చెయ్యలేను ఈ చాకిరీ!" బిగ్గఱగా అరిచింది లక్ష్మి. "ఇవ్వాళ ఆకలి కడుపులతో పోండి స్కూళ్ళకూ, ఆఫీసులకూ. ఎంతకని నేను చచ్చేదీ?"

"ఆ. పోతాలే. చాలాసార్లు నేను ఆకలి కడుపుతోనే పోతున్నాను." అంటూన్న శారద దుఃఖంతో వణికింది.

శివరావు ప్రవేశించాడు రంగంలో. "ఏమిటి లక్ష్మి అదీ? పాపం పరీక్షలు దగ్గఱ పడ్డాయి. చదువుకోనీ ఈ నాల్గు రోజులూ. వీలైనప్పుడల్లా అన్ని పనులూ చేస్తోనే వుందిగా? ఏదీ, కృష్ణని నాకియ్యి నేను ఆడిస్తాను ఆఫీసు కెళ్ళేవరకూ."

"అంతా నాకు చెప్పేవాళ్ళే!" రుసరుసలాడుతూ నిష్క్రమించింది లక్ష్మి. "మగపీరుడిలాగా మహా చదువులు వెలగబెట్టేస్తున్నారు! నా నెత్తిమీదే ఈ సాము అంతా! రేపు పెళ్ళైతే మొగుడికి వండి పెట్టుకోదూ? పిల్లల్ని ఆడించుకోదా?" అన్నది పోతూ పోతూ నిష్ఠురంగా.

అసలే కోపంతో మండిపోతూన్న శారద ఊరకుండ లేకపోయింది. "మాటిమాటికీ శపించకు నన్ను. ఈ దిక్కుమాలిన బాదరబందీ ఎందుకు నాకు? ఏదో నాన్న పుణ్యమా అని చదువుకుంటున్నాను. నా బ్రతుకు నేను బ్రతుకు తానులే."

శివరావుకు నవ్వు వచ్చింది. "లేదు శారదా. అవేం మాటలు చెప్పూ? నీ అమ్మ నిన్ను శపిస్తుందా? అది ఆశీర్వాదం!"

"ఆఁ మరే!" కోపంలో ఉన్న శారద అంతకంటె పలకలేకపోయింది ఆ క్షణంలో.

అంతలో శివరావు దృష్టి మెల్లమెల్లగా బయటికి జారుకుంటూన్న మోహన్‌పై పడింది. "ఒరేయ్, ఎక్కడికి?" అంటూ ఒక్క కేకపెట్టాడు.

అప్పటికే వీధిమెట్లు దిగుతూన్న మోహన్ ఉలిక్కిపడి ఆగిపోయి, అయిష్టంగానే వెనక్కి వచ్చాడు.

"ఎక్కడికిరా అప్పుడే బయల్దేరావ్? వీధులు తుడవటానికా? ఇంకా గంట టైముంది స్కూలుకి."

"కాదు నాన్నా. ఒక ఫ్రెండుతో కలిసి ... కంబైన్డ్ స్టడీస్ ..." మాట తడబడింది.

"ఏడిశావ్ చవటా. కంబైన్డ్ స్టడీస్ చేసేంత బుద్ధిమంతులైన ఫ్రండ్స్ కూడా వున్నారు నీకు! ఆట్టే విధ్వంసం చెయ్యక స్కూలు టైమయ్యేవరకూ బుద్ధిగా ఇంట్లోనే పడి చదువుకో!"

"కాదు నాన్నా!"

"ఏది కాదు?" హుంకరించాడు శివరావు. "ఒరేయ్- ఈ ఏడు కూడా తప్పావో—ఇక నీ ఖర్మ! నేను మళ్ళీమళ్ళీ పరీక్ష ఫీజు కట్టేదీ లేదు, చదివించేదీ లేదు. జాగ్రత్త. నీ ఇష్టం!"

తల వాల్చుకుని లోపలికొచ్చాడు మోహన్ చేసేదేం లేక.

తండ్రిని ఆఫీసుకు వెళ్ళనిచ్చి మోహన్ తల్లి దగ్గరికి చేరాడు. "అమ్మా ... అయిదు రూపాయలు కావాలి..."

"ఎందుకూ ?"

"పనుందమ్మా." గారాలు పోతూ అన్నాడు.

" పనేమిటో నేను వినకూడదా ఏం ?"

"అది కాదమ్మా ... మరీ అందరూ ... ఇదే ఏడాది ఆఖరుకదూ ? చిన్న పిక్నిక్ వేసుకున్నారు. నాన్న నడిగితే ఎటూ ఇవ్వరు"

అంత ఖర్చుపెట్టి వెళ్ళకపోతేం లెద్దూ"

"ఇదేకదమ్మా ఈ ఏడాది కిక ఆఖరూ ? పోనీలే ... వాళ్ళందరి జేబుల్లో చక్కగా ఎప్పుడు చూచినా పదులూ పాతికలూ ఉంటాయి. నేనే ..." లేని ఏడుపుగొంతులో పని మాలా పిలచి పలికించాడు.

"సర్లే బాధపడకు. ఏంచేస్తాం మరీ ! తీసుకెళ్ళు. ఎలాగో ఇస్తానులే" అంటూ అప్పటికప్పుడు ప్రక్కవాటా ముసలమ్మ దగ్గఱకెళ్ళి చేబదులుగా అయిదు రూపాయలు అడిగింది. అన్నీ శారద గమనించుతూనే ఉన్నది.

"ఏం చెప్మా ? ఎవరైనా హఠాత్తుగా చుట్టాలొచ్చా రేమిటి ?" ముసలమ్మ ఆరాగా అడిగింది డబ్బు యిచ్చే ముందు.

"అబ్బే లేదు." లక్ష్మి జవాబు. "మోహన్ ఏదో పిక్నిక్ కెళ్ళాలట! తండ్రి కోప్పడతారని చాటుగా నన్నడుగు తున్నాడు. మగబిడ్డ! సరదాలు తీరేదెప్పుడు మరీ? కుఱ్ఱతనం! వాళ్ళ నాన్నకది అర్థంకాదు !"

వింటూన్న శారద లోలోన ఆశ్చర్యపోయింది. మోహన్‌కు కుఱ్ఱతనం ! సర్దాలు తీరాలి ! మరి తాను ?

తానెంత పెద్దది ? తన సరదాలు మాత్రం తీరనవసరంలేదా ? తను అనుక్షణం సాధించే అమ్మ పుత్రుడి విషయంలో భిన్న దృక్పథంతో మాట్లాడ్తుంది. మోహన్‌కు నిత్యం బాధ్యతలు గుర్తుచేస్తూ నిందించే నాన్న తనను వెనకేసుకొస్తారు తల్లి దగ్గఱ ! ఏమిటీ ఆశ్చర్యకర వైవిధ్యం !'

ముసలమ్మ గొంతు తగ్గించి అంటోంది: "చూడమ్మాయి లక్ష్మీ, పెద్దదాన్ని చెప్తున్నాను— ఏమనుకోబోకు గానీ-ఇలా మీ ఆయనకు తెలియకుండా చాటుమాటున పిల్లాడికి డబ్బు లిచ్చావంటే నువ్వు వాడిని చేజేతులా పాడు చేస్తున్నావన్నమాట ! ఇది మంచి పని కాదు !"

"అదేమిటి బామ్మగారూ ?" అయోమయంగా అడిగింది లక్ష్మి.

"అంతేనే తల్లీ. గారాం కొద్దీ — మగవాడనే మురిపెం కొద్దీ మనంఇస్తాం. వాళ్ళు అది గ్రహించే నాన్నల చాటున అమ్మల దగ్గఱ డబ్బు గుంజి తీసికెళ్తారు సిగరెట్లనీ, అవనీ ఇవనీ నానా చెడు బుద్ధులూ నేర్చుకుంటారు. పూర్తిగా నాశనమయ్యాక కానీ తలిదండ్రులకు తెలియదు అసలు భాగోతం. తెలిసేప్పటికే వాళ్ళేమైనా చేయగల స్థితి దాటిపోయివుంటుంది."

"అబ్బే ! మోహన్ అటువంటివాడు కాదు !" అభిమానంగా బింకం తొణికిసలాడే స్వరంతో అన్నది లక్ష్మి

"అయ్యోరాత ! అందరూ అలాగే అనుకుంటారే అమ్మాయి మొదట ! తెలిసివస్తేగాని తెలియదు మరి !" అంటూ "ఒసే రవణా ఇటు రా !" అని పిల్చింది.

లోపల్నుంచి ఓ ఇరవైయేళ్ళ యువతి వచ్చింది.

"నా రెండో కొడుకు కూతురిది. మీరెప్పుడూ చూళ్లేదు. ఈ పొద్దున్న బండిలోనే దిగింది." అంటూ పరిచయం చేసింది ముసలామె.

"అలాగా? అత్తవారే వూరమ్మా?" లక్ష్మి అడిగింది కుశల ప్రశ్నగా.

వింటూనే ఆ యువతి ముఖం చిన్నబోయింది.

ముసలమ్మ మళ్ళీ ధారాళంగా ఉపన్యాసం ప్రారంభించింది. "అయ్యో రాత! అత్తవార్ని అడుగుతున్నావ్? దానికి పెళ్ళి ఎవరు చేస్తారు? దాని కసలు పెళ్ళి చేయాలనే తలపెవడికి వుందంట?" ఆవేశంతో స్వరం తీవ్రత పుంజుకొంది.

ఇబ్బందిగా చూచింది లక్ష్మి. రవణ తల వంచుకుని లోపలికెళ్ళిపోయింది.

ముసలమ్మ విశదీకరించింది విషయాన్ని. "నా రెండో కొడుక్కి మగపిల్లలూ వున్నారు - ఈ రవణ కంటె పెద్దాళ్లే! ఏం లాభం? ఒక్కడికీ సరిగా చదువులు వంట బట్టక ఆకతాయి వెధవలయ్యారు. అవ్వటానికి నా కొడుకు వులే! పిల్లల్ని గడగడలాడించేస్తాడు. అయితే ఏం - నా కోడలు నీలాంటిదే. మొగుడికి తెలియకుండా చాటునా మాటునా పిల్లలకి అడిగినంత డబ్బూ యిచ్చేది! వాళ్ళేమో స్కూళ్ళు ఎగ్గొట్టి ఇష్టం వచ్చినట్లు తిరిగి నాశనమయ్యారు. ఒక్కడికీ ఇస్కూల్ ఫైనల్ చదువుకూడా అబ్బలేదే అమ్మాయ్! ఆడదానికి చదువెందుకని దీన్నేమో బాగా చదువుతున్నా సరే చదివించ లేదు.

"ఇప్పుడేమో పిల్లలు అప్రయోజకులు — ఎవ్వడూ ఎర్ర్ఱని ఏగానీ సంపాదించేవాడు లేడు. తండ్రి రిటైరయ్యాడు. ఈ ఆడపిల్ల సంపాదించి పెడితే ముసలాళ్ళూ కుఱ్ఱాళ్ళూ కూడా తినడానికి కాచుక్కూచున్నారు! దానికి పెళ్ళేమిటంకా? మొగుడు వూరికేగానీ వస్తాడా ? ఏదో నీ క్షేమంకోసమే చెప్పానమ్మాయ్. అర్థం చేసుకుంటే నీకే మంచిది !"

"ఏదో ఒక్కొక్కళ్ళ అదృష్టంలెండి బామ్మగారూ అది !" యదార్థాన్ని ఒప్పుకోవటానికి ఎవ్వరూ తేలికగా యిష్టపడరు.

అంతవఱకూ అంతా మౌనంగా వింటూన్న శారద నవ్వుతూ అడిగింది. "బామ్మగారూ ! మీరూ అస్తమానూ నన్ను చదువులెందుకు ఆడాళ్ళకి—ఉద్యోగాలకా, ఊళ్ళేలటానికా అంటూంటారు కదూ మరి ? ఇప్పుడు మాట మార్చేశారేం మరీ ?"

బామ్మకు కోపం రాలేదు. నవ్వేసింది "ఇవాళ రవణని చూశాక ఇలా మారిపోయానే అమ్మాయ్. రోజులు మార్తున్నాయి మరి ! చూడమ్మా లక్ష్మమ్మా ... పిల్లది ఇస్కూల్ ఫైనల్ పాసై ఏదో టైపూ అవీ నేర్చుకుందిట. అవన్నీ నాకు నోరు తిరిగి చావ్వు ... ... మీ ఆయన ఆఫీసులో ఏదైనా కాస్త ఉద్యోగం వేయించి పుణ్యం కట్టుకోమను తల్లీ !"

"అలాగేలెండి" అంటూ వచ్చేసింది లక్ష్మి. అయిదు రూపాయలూ మోహన్ చేతిలో పెట్టాంటే లక్ష్మికి కొంచం బాధనిపించింది — జీవితంలో మొదటిసారిగా. 'అర్థం చేసు

కుంటే నీకే మంచిది ... ... రోజులు మారాయి!' ముసలమ్మ మాటలు అదే పనిగా చెవుల్లో నినదించసాగాయి.

అంతకు రెండ్రోజుల ముందే శారద ఏదో గైడ్ కొనుక్కోవాలని నాలుగురూపాయ లడిగింది. "రోజూ ఎక్కడ తేను? ఏ లైబ్రరీ పుస్తకాలో తెచ్చుకుని గట్టెక్కించెయ్యి" అంటూ తండ్రి విసుక్కున్నాడు. తల్లి దగ్గఱ ఇంటిఖర్చుల నిమిత్తం కొంచం డబ్బు వుంటుంది. అందుకే మళ్ళీ శారద తల్లి నడిగింది. "మగరాయుడులాగా నీ చదువులకోసం కూడా ఎక్కడ తెచ్చిపొయ్యనే రోజూ!" అనేసింది లక్ష్మి. శారద అభిమానవతి! మళ్ళీ అడగలేదు; రెట్టించలేదు. కాలేజీ లైబ్రిరీనుంచో, క్లాస్‌మేట్స దగ్గఱనుంచో కావలసిన పుస్తకాలు తెచ్చుకొని అర్ధరాత్రివఱకూ కూర్చుని చదువుకొంటోంది.

పశ్చాత్తాపంవంటిది కలిగింది లక్ష్మి మనస్సులో, తొలిసారిగా. 'నేను ఎంతో విసుక్కుంటాను. దానికి చదువు అనవసర మనుకుంటాను. ఇంట్లో సగంపని పైగా తానే చేస్తుంది. అయినా శ్రద్ధగా చదువుకుని ప్రతి ఏడూ పాసౌతూంది. మోహన్ ఏ పని చేయక్కర్లేదు. అడిగిన డబ్బు దొరుకుతుంది. అయినా ... ... ఒక్కోక్లాసు రెండేసేళ్లు. అదైనా చదవరా, చదవరా అని బ్రతిమాలితే!'

శారద కాలేజీకి వెళ్ళడానికి తయారై వచ్చింది, చేతిలో పుస్తకాలతో, "వెళ్తున్నానమ్మా!"

"చారూ, అన్నం అయ్యాయి. తిని వెళ్ళు! కూర అవ్వలేదు." అన్నది లక్ష్మి.

"వద్దులేమ్మా. ఆకలి లేదు. రాత్రికి తింటాగా ?" అంటూనే వెళ్ళిపోయింది శారద.

'పొద్దున్న విసుగులోవుండి ఆకలి కడుపులతో వెళ్ళ పోవాలి, వంట చెయ్యలేను — అని తిట్టింది తాను ! అందుకే శారద భోజనం చేయలేదు. ఎంత అభిమానం !' బాధపడింది లక్ష్మి మాతృ హృదయం.

కాలేజీలో మధ్యాహ్నం లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో శారద తన చిన్ననాటి స్నేహితురాలైన పద్మతో మాట్లాడుతోంది.

కాలేజీలో క్లర్క్ పోస్టు ఒకటి ఖాళీగా వుందని తెలిసి అప్లికేషన్ పెట్టిందట. ఆ విషయమై కనుక్కోవడానికి వచ్చానంటూ సంభాషణ మొదలుపెట్టింది.

"చాలా సింపుల్‌గా తయారయ్యావ్. ఇదివరకటి నీ వేషానికీ ఇప్పటి వేషానికీ అస్సలు పోలికే లేదు. గుర్తుపట్ట లేదుసుమా నేను మొదట !" ఆశ్చర్యం ప్రకటించింది శారద.

భావగర్భితంగా నవ్వింది పద్మ. "అప్పుడేముందోయ్ ! ఏడ్చో మొత్తుకునో హఠంవేసో - ఎలాగో ఓలాగు అమ్మా నాన్నల దగ్గఱ డబ్బు వసూలు చేయటం - ఇష్టం వచ్చిన బట్టలూ, స్నోలూ, పౌడర్లూ కొనేసుకోవడం టిప్‌టాప్‌గా తయారవ్వడం !"

"ఇప్పుడు పెద్ద ఆరిందావై పోయావా ఏమిటి ?" నవ్వేసింది శారద.

పద్మ నవ్వలేదు. "నిజం శారదా. ఆరిందానైపోయా ననుకుంటా. ఇనక మన అవసరాలన్నీ తీర్చే వాళ్ళున్నంత వఱకూ మనకు బరువూ బాధ్యతా ఏమీ తెలియవనుకో !

ఏడాదినాడు నాన్నగారు హఠాత్తుగా జబ్బుపడ్డారు. ఉద్యోగముపోయింది. పిల్లల్లో నేనే పెద్దదాన్ని. ఏం చేయను? చదువు ఆపి ఉద్యోగం వేట ప్రారంభించాను. నాన్నగారి స్నేహితుల ద్వారా ఓ టెంపరరీ ఉద్యోగం వచ్చింది ఆరు నెల్లు చేశాను. మన చేత్తో మనం సంపాదిస్తూంటే డబ్బు విలువ ఎంత బాగా తెలిసివస్తుందనుకున్నావ్. ఇంటి ఖర్చులు, నాన్నగారి మందులు, తమ్ముడూ చెల్లెలూ చదువు-సర్దుకు రాలేక చచ్చిపోతున్నాననుకో! ఎంత సాదాగా బ్రతికినా వచ్చే జీతం చాలదు ... ఎప్పుడైనా మరీ పీడించి విసిగించినప్పుడు "సంసారం, బరువూ బాధ్యతా మీదపడ్డనాడు కాని మా కష్టసుఖాలు తెలిసిరావే తల్లీ నీకు. ఎలా సర్దుకొస్తున్నామో ఏమైనా తెలుస్తోందా నీకు?" అని విసుక్కునేవారు అమ్మా నాన్నగారూ. ఆ మాటల అర్థం ఇప్పుడు తెలిసి వస్తోందనుకో! అఫ్‌కోర్సు. నాన్నగారి సంసార భారాన్నే నేను పైన వేసుకున్నాను. ఇక నా స్వంత సంసారమే అయితే ఇంకా ఎంత కష్టమో — వద్దులే భగవంతుడా ఇలాగే కన్యగా జీవితం గడిచిపోతే చాలనిపిస్తోంది!"

తనతోటిదే అయినా తన కంటె ఎదిగిపోయిన మనస్సుతో — అనుభవంతో మాట్లాడుతూన్న పద్మను ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో చూస్తూండిపోయింది శారద.

మానవజన్మ మహత్తరమైన వరమని అంటారుగానీ, నామటుకు నాకూ ఇదొక శాపం .. అనిపిస్తుంది శారదా. అమ్మయ్యో ఎన్ని బాధ్యతలు! ఇంతకంటె పశువులూ పక్షులూ హాయిగా బ్రతుకుతున్నాయేమో!"

శారద ఆలోచనలో పడింది. 'ఎటు చూచినా జీవితాలలో ఏవో ఓ బాధలేనా ? మరైతే మనుషులెందుకు ... ఏ ఆశతో ఇలా బ్రతుకుతున్నారు ?' ప్రశ్నలు ఎన్నైనా ఉదయిస్తాయి కానీ, సమాధానాలు మాత్రం దొరకడం కష్టం.

పద్మ నవ్వుతూనే తన మనస్సులోని బాధను కక్కేసింది. "ఏమిటో చదువో చదువో అని ఉబలాటపడి చదువుకోవడమేకాని, చదువుకున్న ఆడవాళ్ళకి సుఖం చాలా తక్కువ - బాధ్యతలూ, నిష్ఠురాలే ఎక్కువ అన్పిస్తోంది శారదా చూడగా. ఉద్యోగం చేయడం మొదలుపెట్టాక నాకు జీవితంలోని భయంకర సత్యాలూ, అదను దొరికితే నాశనం చేద్దామని చూచే మగవాళ్ళ మాయలూ బాగా తెల్సివస్తున్నాయి.

"చిన్నప్పుడు అమ్మ 'ఆడదానికి చదువెందుకు — హాయిగా పెళ్ళి చేసుకుని సంసారం చేసుకోక !' అని ఎప్పుడైనా అంటే నాకు కోపం ముంచుకొచ్చేది; అసహ్యం పెల్లుబికేది. సంసారం - పిల్లలూ - జంఝాటం అంతా ఒక రొంపిలాగా కన్పించేది. పెళ్ళే చేసుకోనని భీదరించుకుంటూ మాట్లాడేదాన్ని. ఒకటి రెండు సంబంధాలవాళ్ళు ఒప్పుకొన్నా తిరగ్గొట్టేశాను. ఇప్పుడన్పిస్తుంది – అయ్యో అమ్మ చెప్పినట్టు విని పెళ్ళిచేసుకొంటే హాయిగా ఉండేదికదా అని ! పెద్దవాళ్ళ మాటల్లో ఎంతో అనుభవం వుంటుందనుకో ! మన స్నేహితురాలు జ్యోతి లేదూ - ఉద్యోగం చేసి సంపాదిస్తోందన్న పేరే కాని అత్తమామల గోల అంతా ఇంతా కాదు. ఆ మొగుడొక వాజమ్మ-తన ఎదుటే తల్లి భార్యను తిడ్తూన్నా

నోరెత్తడు. ఇటు ఇంట్లో చాకిరీ చెయ్యాలి, అటు ఉద్యోగం చేసి సంపాదించాలి. ఆమధ్య నేను వెళ్తే ఏడ్చింది. ఎండిపోయి - వెనకటి అందమే లేదనుకో మనిషిలో!"

"ఇంతకూ ఏమిటంటావ్? పెళ్ళిలోనూ సుఖం లేదంటావ్. పెళ్ళి చేసుకోపోయినా శాంతి లేదంటావ్. మరింక దారేముంది?" నవ్వుతూ అడిగింది శారద. ఆ ఉదయం పరిచయమైన రమణ మెదిలింది ఆమె దృష్టిలో!

"దారీ లేదు, పాడూ లేదు. పుట్టినందుకు తప్పనిసరిగా చచ్చేవఱకూ బ్రతకవలసిందే. ఇప్పుడు సుఖం లేకపోయినా ఎప్పుడో ఏదో జరుగుతుందనే ఆశతో బ్రతకాలి. అంతే. నా మట్టుకు నాకు జీవితం వరం కాదు కానీ, శాపం అనిపిస్తుంది!"

అంతలో గంట మ్రోగడంతో కబుర్లు కట్టిపెట్టి క్లాసుకు దారి తీసింది శారద మిత్రురాలికి వీడ్కోలు చెప్పి.

సాయంత్రం యింటికి వచ్చేసరికి శుభవార్త సిద్ధంగా ఉంది శారదకు. తల్లీ తండ్రీ వదనాలు ఎందుకంత కళకళలాడుతున్నాయో అర్థం చేసుకోలేకపోయింది మొదట.

బాత్‌రూమ్‌లో కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చేసరికి తల్లి కాఫీ సిద్ధంగా వుంచటం చూచి ఆశ్చర్యపోయింది శారద. మోహన్‌కైతే అందిస్తుంది కానీ అలా తనకెప్పుడూ తల్లి ఏమీ చెయ్యదు. "కాఫీ చేసుకు త్రాగు అన్నం పెట్టుకు తిను..." ఇలాంటి మాటలకు అలవడిపోయిన శారదకు ఇవాళ తల్లి తీరూ, ఆప్యాయతా వింతగా తోచాయి.

"నేను చేసుకుందునుకదామ్మా! కృష్ణ ఏడుస్తున్నట్టున్నాడు!" అన్నది మెల్లగా కాఫీ తీసుకుంటూ.

"ఇంకెన్నాళ్ళు లేమ్మా నువ్విక్కడుండేదీ, నీకు నేను చేసేదీని !" అన్నది లక్ష్మి.

"ఏమిటమ్మా?" అయోమయంగా చూచింది శారద.

"బావా బావా పన్నీరు, బావని పట్టుకు తన్నేరూ" అని ఏడిపించొచ్చు కదక్కా ఇక మేం ! మరీ – నీకు పెళ్ళటగా ? అమ్మ చెప్పిందీ ?" పాప ఉత్సాహంగా అన్నది.

శారద భావాలు భాష కందకుండా పరుగులెత్తాయి.

అంతలో తండ్రి రానే వచ్చాడు. "ఇలారా శారదా! ఓ మాట చెప్తాను."

క్లుప్తంగా తాను చూచిన పెళ్ళి సంబంధం విషయాలు వర్ణించాడు. "కుఱ్ఱవాడు మంచివాడనే అందరూ చెప్తున్నారు. మూడువందల యాభై సంపాదిస్తున్నాడు. ఇంకా పెరుగుతుంది జీతం. పెద్దగా హిరణ్యాక్షవరాలేం కోరటం లేదు. మూడు వేలు మాత్రం కట్నం అడుగుతున్నారు. మన పొలం ఓ ఎకరం అమ్మి కట్నం డబ్బు సమకూరుస్తాను. నీ పెళ్ళి అయిపోతే కొంత బరువు తగ్గుతుంది మాకు. నెమ్మదిగా కూడదీసుకోనేటప్పటికి మళ్ళీ పాప ఎదిగివస్తుంది."

శారద మౌనంగా వింటోంది.

శివరావు పొడిగించాడు: "ఆ ఏటికా ఏడు బాధ్యతలు పెరుగుతున్నాయి. పిల్లలందరూ చదువులకు ఎక్కివస్తారు. అంతా ఎదర ఖర్చే కాని ఇంకేంలేదు. అందువల్ల ఇప్పుడే అంతా బాగున్నప్పుడే నీ పెళ్ళికి అంత కష్టం అనిపించదు. ఇంతకంటె పెద్ద సంబంధం-ఇప్పుడే కాదు మరెప్పుడూ తేలేం.

దైవికంగా వచ్చింది కాదనటం తెలివితక్కువేమో! ఆలో చించుకో మరి!"

అప్పటికీ శారద మాట్లాడలేదు.

"నువ్వంగీకరిస్తే ఎంతో మంచిది శారదా. ఈ కాలంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు ఎంత కష్టమో నువ్వూ చూస్తూనే వున్నావ్. నేనేం చెప్పను. ఎప్పటి బాధ్యతలు అప్పుడు నెఱవేర్చడం చాలా తెలివైన పని ఈ కాలపు తలి దండ్రులకు."

శారద మనస్సులో రమణ, పద్మ, జ్యోతి మెదిలారు.

"మీ ఇష్టం నాన్నా!" అంది మెల్లగా.

"నే చెప్పలేదూ. మన మాట కాదంటుందా మన మ్మాయి?" దీర్ఘం తీసింది లక్ష్మి.

విషయం విన్న పక్కవాటా ముసలమ్మ "సంతోషం తల్లీ! ఏడాది తిరిగేసరికి మా లక్ష్మమ్మ మనవల్ని కూడా ఎత్తుకుంటుందికాబోలు! ఒక్కోళ్ళ అదృష్టం అదీ!" అంటూ వ్యాఖ్యానించింది.

సిగ్గుపడింది శారద ముసలమ్మ మాటలు వింటూ.

అక్కడేవున్న రమణ ముఖంలో దిగులు కన్పించింది శారదకు. మెల్లగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

'ఇక ఈ చదువుకు స్వస్తి!' అన్పించగానే దిగులైంది మనసులో. కాని ...'క్రొత్త జీవితం... సాయంత్రం వేళల్లో కాలేజీనుంచి వచ్చేప్పుడు ఎన్నో జంటలు ఎదురౌతాయి! ఇక తనూ అలాగే ... భర్తతో ...' మధుర ఊహాలు మనసును ఉల్లాసపరిచాయి.

'అక్కా ... ఎత్తుకో' వచ్చీ రాని మాటలతో కృష్ణ వచ్చి చీర కుచ్చెళ్ళు పట్టుకుని అడుగుతూంటే ముద్దుగా ఎత్తుకుంది. అంతలోనే "వుండరా ... ఇది మంచి చీర. నీ మురికంతా అంటిస్తావ్" అంటూ దింపేసింది.

ఇంకా మునమ్మతో కబుర్లు తరగకుండా చెప్తున్న లక్ష్మి అది చూచి నవ్వుతూ అన్నది. "ఇంకెన్నాళ్ళు ఈ షోకులు! చూస్తానుగా ఏ మాత్రం నీటుగా వుంటావో! కట్టుచీర పాతచీరా ఒకటేనే అమ్మా పిల్లల తల్లులకి."

ముసలమ్మ అందుకుంది. "కాదు మరీ! ఈ షోకులన్నీ మన దగ్గరే. మా పెద్దాడి కూతురు రమ అంత షోగ్గా వుండేదా — ఎక్కడా చీర నలగకుండా, యిప్పుడు చూడు - పిల్లాడి ముక్కు కూడా చీర చెంగుతో తుడిచేస్తుంది. నీటూ గోటూ యేమయ్యాయో మరి!"

పైకి యేమీ మాట్లాడకపోయినా శారద మనస్సులో నిన్నటి సంఘటన మెదిలింది. 'శపించక, పెళ్ళి, పిల్లలూ, రోష్టూ నాకూడా ఎందుకూ?' అంటే తండ్రి 'అది శాపం కాదు. ఆశీర్వాదం!' అన్నాడు. నిజమే. చుట్టూ ప్రపంచాన్ని చూచి యేహ్యపడినా — పెళ్ళి అనే దానిలో యేం మహాత్యమున్నదో మరి! అలా తీయగా తోచి మనసును లాగుతుంది! కొన్నేళ్ళకి తానూ కూడా అమ్మలాగే పిల్లలతో ... సంసారంలో ...' తన ఊహాలు తనకే సిగ్గనిపించాయి. 'ఔను. జీవితమే తీయని శాపం నా వంటి యువతులకు.' అనుకొంది తృప్తిగా!

—: సమాప్తం :—